# తాంబూలాలు

సతీసమేతంగా రైలు దిగిన విశ్వనాథం ప్లాట్‌పారం మీద నిలబడి నాలుగు పక్కలా పరీక్షగా చూశాడు. జనంతో కిటకిటలాడుతున్న ప్లాట్‌ఫారం కోలాహలంగా ఉంది.

ఎవరైనా పరిచయస్థులు కనిపించరా అని అతని కళ్ళు గాలిస్తున్నాయి. తన వెర్రి గాని పాత పరిచయస్థులు ఎవరైనా కనిపించినా తను గుర్తుపట్టగలడా, లేక వాళ్ళు తనను పోల్చగలరా?

అబ్బో - ఇప్పుడా? ఎప్పుడో ముప్పై ఆరేళ్ళ క్రితం పొట్ట చేతపట్టుకుని పుట్టిన ఊరు వదలి ఢిల్లీ వెళ్ళి, అక్కడి పౌరుడిగా స్థిరపడిపోయాడు. చేతిలో స్కూలుఫైనలు ప్రమాణపత్రం మాత్రమే ఉంది. కొంతకాలం ఆర్థికంగా ఇబ్బందులకు గురి అయితేనేం, మెల్లగా నిలదొక్కుకున్నాడు. ఒక వంక ప్రైవేటుగా పైచదువులు చదువుతూ, వేరొక వంక డిపార్టుమెంటలు పరీక్షలు పాసౌతు, చివరకు ఏ-1 గ్రేడు ఆఫీసరుగా రిటైరు అయ్యాడు.

తాము వచ్చిన పని నెరవేరితే ఒక బాధ్యత తీరుతుంది. పార్వతికి ఆనందంగా ఉంది. తన భర్త బాగా ఆలోచించికాని ఏ నిర్ణయం తీసుకోడు. అతని నిర్ణయాలవల్ల సత్ఫలితాలే ఉంటాయి.

ఆ దంపతులకు ఇద్దరే ఆడపిల్లలు. వారి చదువులు కాగానే ఘనంగా పెళ్ళిళ్ళు చేశాడు. ఆడపిల్ల లిద్దరూ అత్తవా రిళ్ళలో సుఖంగా కాపురాలు చేస్తున్నారు.

ఈకార్యం కూడా పూర్తి అయితే తాము నిశ్చింతగా ఉండవచ్చు. భర్తతో ఆ మాట చెప్పాలని ఆమె ఎన్నోమార్లు అనుకుంది.

ప్రకాశ్ ఆమె స్వంతకొడుకు కాదు. కాని స్వంతకొడుకు కాదని ఆమె ఏనాడూ భావించలేదు.

విశ్వనాథం తమ్ముడూ, అతని భార్యా ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్రకాశ్ అప్పుడు అయిదేళ్ళ వాడు, అప్పటినుంచి ప్రకాశ్ బాధ్యతలను తనమీద వేసుకున్నాడు విశ్వనాథం. వాడు ఖర్గపూర్‌లో ఇంజనీరింగ్ చదివి ఈ మధ్యనే అసిస్టెంట్ ఇంజనీరుగా ఉద్యోగంలో చేరాడు.

బెల్లం ఉన్న చోటకి చీమలు వచ్చినట్లు పెళ్లీడుకొచ్చిన మగపిల్ల లున్న ఇంటికి ఆడపిల్లల తల్లిదండ్రులు రావటం సహజం. ఔను, వారి ఆత్రత అలాంటిది.

"పార్వతీ! నీ కొడుకు పెళ్లి మాట తలపెట్టవేం? వాడింకా పసిపాపడే అనుకుంటున్నావా?" అని ఒక రోజు భార్యతో అన్నాడు విశ్వనాథం.

ఉద్యోగరీత్యా వాడు పైచోట ఉంటున్నాడు. వారంవారం వచ్చి పోతూ ఉంటాడు. ఈడూ వచ్చింది. ఏ ఈడుకా ముచ్చట. ఇద్దరు కూతుళ్ళను అత్తవారిళ్లకు పంపింది. మరి కోడల్ని తెచ్చుకోవాలన్న

కోరిక పార్వతికి ఉండదా? ఆ శుభఘడియ కోసం కాదూ ఆమె ఎదురు చూస్తున్నది. అయితే పార్వతి ఏనాడూ భర్తతో తన మనసులోని మాట చెప్పదు. చెప్పవలసిన అవసరం ఆమెకు ఇంతవరకు రాలేదు. ఆమె మనసులో భావాలను చదివేశక్తి అతనికి ఉంది. అందుకే వారు ఈ ముప్పై అయిదు సంవత్సరాల వైవాహిక జీవితాన్ని ఆకూ పోకచెక్కల్లా గడుపుతూ వస్తున్నారు.

అమ్మా! ఇన్నాళ్లకు వారు వాడి పెళ్లిమాట కదిపారు. ఆమె మనసులోనే పొంగిపోయింది. అయినా తన ఆనందాన్ని వ్యక్తపరచలేదు.

"పార్వతీ! మాట్లాడవేం? వాడిని బ్రహ్మచారిగానే బ్రతకమంటావా?"

"ఏం వాడు మీకేనా కొడుకు, నాకుమాత్రం కొడుకు కాడా? వాడికి పెళ్లి చేయ్యాలన్న కోరిక నాకెందుకు ఉండదు?" అంది.

"నీ కొడుకు పెళ్ళి చూడాలన్న కోరిక నీకున్నట్లు ఇంతకాలం నాకు చెప్పలేదేం?"

"ఏం, వాడు నాకేనా కొడుకు? మీకు మాత్రం కాడా? ఈ విషయం మీతో నేను పనికట్టుకొని చెప్పాలా? మీకు తోచదని నే నెలా అనుకోను?" అంది.

"పార్వతీ! వాడికి పిల్ల నిస్తామంటూ చాలామంది వస్తున్నారు. మనం మాత్రం ఎంతకాలం దాటేస్తాం? ఈ ఒక్క కార్యంకూడా అయిపోతే మనం తేలికపడతాం. మనం ఏదో ఒకటి చూసి నిశ్చయించాలి" అన్నాడు.

"అంటే మన ప్రకాశానికి ఈడూ జోడైన పిల్లల వివరాలు తెలిశాయా?"

"ఇదమిత్థంగా ఏ పిల్ల గురించి నేను ఆలోచించటంలేదు. త్వరగా ఈ శుభకార్యం జరిపించాలన్న ఉద్దేశ్యమే ఉంది. ప్రకాశం తత్వం నీకు తెలుసు. వాడు మన ఎన్నిక కాదనడు. గుణవంతురాలైన పిల్ల కావాలి. వంశం, మర్యాదా ముఖ్యం. చదువుకి ప్రాధాన్యమిస్తాను. కానీ చదువువల్ల అహంకారం ఉండకూడదు. పనీపాటా వచ్చి పూసలోదారంలా ఉండగలగాలి."

"పెళ్లి అంటే నూరేళ్ల పంట. నిర్ణయంలో ఎలాంటి పొరపాటు ఉన్నా వాళ్లు జీవితాంతం బాధపడతారు" అంది పార్వతి.

"ఈ మధ్య వామనమూర్తిగారు వచ్చారు. గుర్తుందా? మనోహరరావుగారి అమ్మాయి గురించి చెప్పారు. ఆ తరువాత మనోహరరావుగారూ రెండు ఉత్తరాలూ వ్రాశారు. పెళ్ళిచూపులకు రమ్మన్నారు. ఆ పిల్లను చూసి అన్నీ అనుకూలంగా ఉంటే తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొని ఈ వైశాఖంలోనే పెళ్ళి జరిపిస్తే ఎలా ఉంటుంది?" అన్నాడు విశ్వనాథం.

"ఎలా గుంటుందని మీరు నన్ను అడగాలా? అయినా వాడి ఉద్దేశ్యం కనుక్కున్నారా? పెళ్ళి చూపులకి వాడు రావాలికదా."

"పార్వతీ! మీ కంటూ అభిప్రాయాలూ, కోరికలుంటాయో, ఉండవో నాకు తెలియదు. అన్నిటికీ బాధ్యత నామీద పెట్టి తప్పించుకుంటారు. చివరకు నా నిర్ణయం సరియైనది కాకపోతే ఆ నెపం నామీదకు తొయ్యాలనా?"

"బాగుందండీ! ఏనాడైనా మీ నిర్ణయంవల్ల మాకు హాని కలిగిందా? ఈ సంసారం బరువు బాధ్యతలను మోస్తున్నది మీరు. మా బాగుని కాంక్షించేవారు మీరు కాక మరెవరు? మీరు ఏ నిర్ణయం

తీసుకున్నా అవి మా మంచికేగా!"

"అంతే, సరిగ్గా వాడూ ఇదే అంటాడు. ఔను. నువ్వు వాడిని అలా పెంచావు. అయినా ఇది వాడి జీవితానికి సంబంధించినది. పెళ్ళిచూపులకు వచ్చినంత మాత్రాన నష్టం ఏముంది? పెళ్లి చూపులవల్ల ప్రయోజనం శూన్యమట. ఒక అమ్మాయి అందగత్తా కాదా, ఆమె మాటకారా కాదా తెలుసుకోవచ్చుట. అరగంట పెళ్లిచూపుల్లో గుణం ఏం తెలుస్తుంది? వాళ్ళ పూర్వాపరాలు, మంచి చెడ్డలూ, మనసులూ చదవటం తెలుసుకోవటం సాధ్యం కాదట. ఈ విషయాలు పెద్దవాళ్లు ఆలో చించవలసినవట. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులు చూడాలిగాని వాళ్ళకంటూ వేరే అభిప్రాయాలు ఎందుకుండాలి అంటాడు. వాడికి పెళ్ళిచూపులు నచ్చవట. అది ఆడపిల్లలను కించపరచడమేనట. కాని ఆమె తల్లిదండ్రులు, తనను చూడాలనుకుంటే ఆ తరువాత ముఖం చూపించి వస్తాడట" అన్నాడు.

"వాడు మీ కొడుకే అనిపించుకున్నాడు. ఇంకేం? ముందుకు పదండి" అంది.

పార్వతికి ఒక అనుమానం వచ్చింది. మనోహరరావుగారి సంబంధం చేసుకోవాలనేనా అతను ఈ ఊరి ప్రయాణం తలపెట్టింది? ఇక్కడే కదూ అతని బాల్యస్నేహితుడు కరుణాకరం ఉంటున్నాడు. అతడ్ని చూడాలన్న తాపత్రయం కాదా?

"పార్వతీ! తెలిసిన వాళ్లెవరూ కనిపించలేదు. ఇక బయలుదేరుదామా?"

వాళ్ళు దిగిన రైలు అప్పటికే వెళ్లిపోయింది. ప్లాట్‌ఫారం మీద జనం పల్చబడ్డారు. కాఫీ, టీలు, తినుబండారాలు అమ్ముకునేవాళ్లు కనుమరుగయ్యారు.

పార్వతి నవ్వింది.

"జవాబు చెప్పకుండా నవ్వుతావేం?"

"ఇలా పది నిమిషాలు ఎలా ఆలస్యం చేశారా అన్న విషయం అర్థంకాలేదు. మీ బాల్య స్నేహితుడిని రైలు దిగగానే కలుసుకొని కావలించుకోవాలని ఉంటే వస్తున్నట్లు ముందుగా టెలిగ్రాం ఇవ్వవలసింది. బాగుందండీ! అతనికి కాని కల వస్తుందా – మీరు అమాంతంగా ఊడి పడుతున్నట్లు. ఇంకా ఆలస్యం దేనికి? పదండి" అంది.

బయటకు వచ్చి రిక్షావాడికి వీధిపేరు చెప్పాడు. రిక్షాకంటే వేగంగా అతని మనస్సు ప్రయాణం చేస్తోంది.

చదువు చెప్పేవారు దైవ సమానులని పూర్వీకుల నిర్ణయం. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' అని విద్యాదానం చేసే గురువుకు ఉన్నత స్థానం ఇచ్చారు. విద్యను షోడశ దానాల్లో ఒకటిగా పరిగణించిన సాంఘిక వ్యవస్థ అది. కాలానికి సహజగుణం మార్పు. సాంఘిక వ్యవస్థ కూడా మార్పు చెందటం, కాలమహిమే! ఆచార్యుడు ఉపాధ్యాయుడిగా, బడిపంతులుగా మిగిలిపోయాడు. ఉపాధ్యాయ వృత్తి ఎంత గౌరవప్రదమైనా సంఘంలో వారికి ఆ స్థానం లేదు నేటి వ్యవస్థలో. బ్రతకలేని వాడు బడిపంతులౌతున్నాడు.

కరుణాకరం జీవిత మూల్యాలనాశించి ఉపాధ్యాయవృత్తిని చేపట్టాడు. అయితే సమాజం అతనికేం ఇచ్చింది? అతని దగ్గర చదువుకున్న వాళ్లు ఈనాడు మంచి పదవుల్లో ఉన్నారు. హోదాల్లో ఉన్నారు. పిత్రార్జితమైన ఆ ఇల్లు జీర్ణావస్థలో ఉంది. అతని తండ్రి బీదవాడుకాదు. ఉన్న ఆస్తిపాస్తులను

దేశంకోసం త్యాగం చేశాడు. స్వాతంత్ర్యసంగ్రామంలో గాంధీజీ అడుగుజాడల్లో నడిచి, సత్యాగ్రహాల్లో పాల్గొని జైళ్లకు వెళ్ళాడు. లాఠీదెబ్బలు తిన్నాడు. దేశం దాస్యశృంఖలాలను తెంపుకుంది. యూనియన్ జాక్ స్థానంలో జాతీయ త్రివర్ణపతాకం రెపరెపలాడింది. అయితే ఏ ధ్యేయంతో భారత ప్రజలు ఒక తాటిమీద నడిచి బ్రిటిషు హస్తాల నుండి ఆత్మగౌరవాన్ని తిరిగి పొందారో, ఆ ధ్యేయాలను భావితరాలవారు కాపాడగలరా అన్న శంక ఆ రోజుల్లో చాలామందికి ఉండేది.

అంతస్తునిబట్టి విలువలు మారుతుంటాయి. విలువలను దృష్టిలో పెట్టుకొనే అంతస్తులను పెంచుకుంటుంటారు. రెండింటి మధ్య నిజం ఒప్పుకోలేక, అబద్ధం ఆడలేక మౌనం వహించటం మనిషిలోని బలహీనతకు నిదర్శనం కాని, సంస్కారానికి చిహ్నం కానేరదు. అంతస్తు విలువల మధ్య తనకు తానుగా నిలబడి ఔననిపించుకోగలిగిన సామాన్యుడు అసామాన్యుడే.

ఆ ఇల్లూ, ఆ వాతావరణం బయటనుండి చూసిన విశ్వనాథం కళ్లు చెమ్మగిల్లాయి. పదవులకోసం ప్రాకులాడి ఉంటే ఈ కరుణాకరం దశ ఇప్పుడు మరోలా ఉండేది. తన వెర్రికాని ఈనాడు ఈ కరుణాకరం తన బాల్యస్నేహితుడంటే లోకం తనను పిచ్చివాడంటుంది.

భావి రాజకీయాలను మూడోకంటితో చూశారేమో కరుణాకరం తండ్రి. తన కొడుకుని రాజకీయాల జోలికి పోవద్దని కోరాడు. తండ్రి కోరికమీదట అతను ఉపాధ్యాయు డయ్యాడు.

విశ్వనాథం కళ్లముందు బాల్యం నాట్యం చేసింది. ఆరోజుల్లో ఈ ఇల్లు కళకళలాడుతూ ఉండేది. అతనికి దుఃఖం ఆగలేదు. పార్వతి స్థాణువులా నిల్చుండి భర్తను పరిశీలనగా చూడసాగింది. అతను ఇంతకాలం బాల్యస్నేహితుడిని చూడకుండా ఎలా ఆగగలిగాడు.

భర్తను ఆ పట్టున వదిలేస్తే అతను దుఃఖసముద్రంలో మునిగి, వచ్చిన పని మరిచి, స్నేహితుడిని చూడకుండానే తిరుగు రైలు ఎక్కే ప్రమాదం ఉంది.

కర్తవ్యాన్ని గుర్తుకి తెచ్చుకొని తలుపు తట్టింది పార్వతి.

“ఎవరూ, విశ్వనాధమా! నేను కల గంటున్నానా, లేక యథార్థమా? అరుణా! ఇలారా ఎవరొచ్చారో చూడు. మా విస్సు వచ్చాడు. వీలు చూసుకొని నేను రమ్మనమని రాయడమేగాని, ఏదీ వాడు ఇటుపక్కకు వచ్చాడా? ఈరోజు నిజంగా సుదినం” కావలించుకున్నాడు కరుణాకరం.

“బాగుందండీ! అంత ఆనందాన్ని గుమ్మంలోనే గుమ్మరిస్తారా? అన్నయ్యగారిని, వదినగారిని లోపలకు రానీయండి” అంది అరుణ.

అరుణ అంతకు ముందు వారిని చూసి ఉండలేదు. అయితే వాళ్ళగురించి ఆమెకు తెలియని దంటూ ఏమీలేదు.

వసారాలో మంచం వాల్చింది అరుణ.

“మామయ్యగారూ! నమస్కారం” అంది వత్సల. ఆమె కరుణాకరం కూతురు.

“ఎవరూ, వత్సల కదూ? ఈ పిల్ల పుట్టినప్పుడే కదూ ‘మా యింటికి లక్ష్మి వచ్చింది’ అంటూ రాశావు. అబ్బో, చాలా పెద్దదైంది” అన్నాడు ఆశ్చర్యంగా.

“మామయ్యగారూ! పెరట్లో నీళ్లు పెట్టాను కాళ్లూ, చేతులూ ముఖం కడుక్కోండి” అంది వత్సల.

ఆ తరువాత ఆ బాల్యస్నేహితులు గతంలోనికి వెళ్ళిపోయారు. చిన్నపిల్లలే అయి ఎన్నో

విషయాలు తలచుకుంటూ కడుపారా నవ్వుకోసాగారు. అరుణ వంట ప్రయత్నం చేయసాగింది.

"ఇంతకీ నువ్వు ఇలా ఊడిపడతావని నేను కలలో కూడా ఊహించలేదు. 'నువ్వు చూస్తూ ఉండు, వాడేదో రోజున తప్పక వస్తాడు' అని అరుణతో అంటే నమ్మేదికాదు" అన్నాడు కరుణాకరం.

అరుణ ఆ మాటలు వింది–"మీ మధ్య స్నేహం నాకు తెలియనిదా? మీకు వెళ్ళాలని ఉన్నా వెళ్ళగలిగారా? అలాగే–అన్నయ్యగారు కూడా. ఎవరి సంసారాలు వారివి. చుట్టపు చూపులకు రావాలన్నా పోవాలన్నా, వీలు చిక్కవద్దూ?" అంది అరుణ.

"ఎప్పటికప్పుడూ అనుకోవడమేకాని నిజంగానే అవకాశం కుదరలేదు" అంది పార్వతి.

"ఇక కబుర్లు చాలించండి. భోజనాలకు లేవండి. పాపం అన్నయ్యగారు, వదినా ఎప్పుడు ఎంగిలిపడ్డారో" అంది.

"అప్పుడే వంట అయిందా?"

"అప్పుడే..? వీళ్లు వచ్చి గంటకు పైగా అయింది. మీ కబుర్ల ధ్యాసలో మీకు వేళ తెలిసిరాలేదు. కాఫీ ఇద్దామనుకున్నా కుదరలేదు. పాలు నిండుకున్నాయి" అంది బాధపడుతూ అరుణ.

"అప్పుడే ఒక గంట వెనక్కు వెళ్ళిపోయిందా?" కరుణాకరం విచారించాడు.

"ఇంతకీ నువ్వు ఉత్తరంపత్తరం లేకుండా వచ్చావంటే ఏదో విశేషం ఉండి ఉంటుంది. ఆ మధ్య మనోహరరావుగారు ఒక విషయం చెప్పారు. ఆ మాట విని నేనెంతో సంతోషపడ్డాను" అన్నాడు.

"బాగున్నాయండీ మీ ప్రశ్నలు! అతన్ని భోజనం చెయ్యనియ్యరా? భోజనాలు అయిన తరువాత మీరు ఎంతసేపైనా మాట్లాడుకోండి. నేను అడ్డురాను. ఏమిటో రాకరాక వచ్చిన వారికి పచ్చడి మెతుకులు పెడుతున్నాను" అంది చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ అరుణ.

"చెల్లెమ్మా! ఇందులో బాధపడవలసిందేముంది? 'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు' అంటారు. ఆదరంతో పెడుతున్న ఈ అన్నం పంచభక్ష్య పరమాన్నాలకు తీసిపోతుందా?" అన్నాడు విశ్వనాథం.

"కరుణాకరం! మనోహరరావుగారు నీకు బాగా తెలుసుననుకుంటాను."

"అతన్ని గురించి తెలియనివారు ఈ ఊర్లో – ఊహు కాదు, ఈజిల్లాలో ఉంటారా? పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. అర్బన్ బాంకు అధ్యక్షుడు. అంతేనా?కార్మిక సంఘాల నుంచి లైన్సు క్లబ్బుల దాకా అన్నిట్లోనూ ఉన్నాడు. రాజకీయ పరపతి బోలెడుంది."

"చాలా పేరున్నవాడు అంటావు."

"మెల్లగా అంటున్నావు. అతను చాలా పేరు,ప్రతిష్ఠ ఉన్నవాడు. నాకు తెలుసు నీ వెందుకు ఆరా తీస్తున్నావో?"

"చల్ల కొచ్చి ముంత దాచడం అర్థం లేదు.అతనీ మధ్య రాయబారాలు చేశాడు. అతని కో కూతు రుంది. మన ప్రకాశ్‌కి ఇవ్వాలనే ఉద్దేశం అతనికి ఉంది."

"ఔను. నేనూ విన్నాను.చాలా మంచి సంబంధం " అన్నాడు కరుణాకరం.

"వాడి పెళ్ళి త్వరగా చేయాలని పార్వతి తలబోస్తోంది. ఆడపిల్ల లిద్దరూ అత్తవారి ఇళ్ళకు వెళ్ళిపోయారు" అన్నాడు.

"అంటే వాడికి పెళ్ళి చేయాలన్న ఉద్దేశం నాకే కాని మీకు లేదన్నమాట! మరి మీ కంతగా ఇష్టం లేనప్పుడు పెళ్ళిచూపుల కంటూ ఎందుకు బయలుదేరారు?" నిష్ఠురంగా అంది పార్వతి.

"చెప్పవేం? పెళ్ళిచూపులకు వచ్చారన్నమాట. పోనీ ఈ మిషమీదనైనా వచ్చారు. చాలా సంతోషం. మరి ప్రకాశ్‌ని తీసుకురాలేదేం?"

"వాడి దదో తత్వం. పెళ్ళిచూపులంటే వాడికి ఇష్టం లేదు. మా రమణి, సరోజలను చూసుకుందికి చాలామంది వచ్చి పోయేవారు. పిల్లకు అది రాదనో, ఇది రాదనో అయ్యో బి.ఏ. చదివించారా? అంతకంటే ఏ డిప్లమా కోర్సో చెప్పించవలసింది. బి.ఏ.లకు ఉద్యోగాలు దొరికే రోజులా? అబ్బే ఇంత తక్కువ కట్నంతోనా? మావాడికి ఏభైవేల దాకా ఇస్తామంటూ వస్తున్నారు - ఇలాగుండేవి. దాంతో ప్రకాశ్‌కి వళ్లుమండేది. ఆడపిల్లలంటే అంత చులకనా? ఏం లోపం ఉందని? అవిటి అనా, గుడ్డి అనా, మూగ అనా? ఏం లోపం చూసి పిల్లను చూసి నచ్చలేదని చెప్పి వెళ్ళిపోవటం? ఆడపిల్లలను అవమానించే అధికారం పురుషుల కెవరిచ్చారు? అందుకని తాను పెళ్ళిచూపులకు రానన్నాడు."

"బాగుంది. అధికారం ఒక రిచ్చేది ఏమిటి? ఇది అనాదిగా వస్తున్న ఆచారం."

"ఇంతకీ మనోహరరావు గురించి నీ అభిప్రాయం?"

"మనోహరరావుగారికి నీ గురించి ఎలా తెలిసిందో? ఆయన నిజంగా మంచి చోటే ప్రయత్నం చేసారు."

"నేను అడిగేది వారి గురించి"

"వారి గురించి నేను చెప్పటం అంటే సూర్యునికి దీపం చూపించటంలా ఉంటుంది. ఇది అన్ని విధాలా అనుకూలమైన సంబంధం" అన్నాడు కరుణాకరం.

"అన్నయ్యగారూ! ఇందులో ఆలోచించడానికి ఏమీలేదు. అతను పెట్టుపోతల్లో ఎలాంటిలోపం చెయ్యరు. మీరు ఈ ఊరిపిల్లను చేసుకోవటం మా సౌభాగ్యం" అంది అరుణ.

"అదెలా?" ఆశ్చర్యంగా అడిగాడు విశ్వనాథం.

"పిచ్చి ప్రశ్న! ఈ ఊరి సంబంధం చేసుకుంటే మీరు వచ్చిపోతూ ఉంటారు. మనోహరరావుగారో, వారింటివారో మీ ఊరు వస్తూ వుంటారు. ఇలా మిమ్మల్ని చూసినట్లు ఉంటుంది. ఇది మా అదృష్టం కదూ?" అన్నాడు కరుణాకరం.

పార్వతికి వాళ్ళ ఆప్యాయత అచ్చెరువు కలిగించింది. ఆనందమూ కలిగింది. నిజంగా ఎంత మంచి మనసులు వాళ్లవి.

"ఐతే నేను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రకాశ్ తత్వం వేరు. చాలా సున్నితమైన మనసు. వాడి కాబోయే భార్య ఎలా గుండాలో చెప్పడు కాని మాకు తెలుసు. భారం నామీదే వేశాడు కాబట్టి నేను నిర్ణయం తీసుకోవటంలో తప్పు చేయలేను. పిల్ల నచ్చి వంశం, మర్యాద మంచిదైతే, తాంబూలాలు ఇచ్చి పుచ్చుకుందామన్న ఉద్దేశ్యంతోనే వచ్చాను. మావాడికేకాదు, నాకూ నాన్పుడు వ్యవహారం ఇష్టంలేదు. అందుకే పెళ్ళిచూపులకి ముందే వాళ్ళగురించి పూర్తిగా తెలుసుకోవటం ముఖ్యం. మరో ఇద్దరు ముగ్గురు పిల్లనిస్తామని వచ్చినా,నీ అభిప్రాయం బాగా తెలుస్తుందని ఈ సంబంధం గురించి ఆలోచించి వచ్చాను. కరుణాకరం! నీ సలహాకావాలి" అని విశ్వనాథం నిశితంగా కరుణాకరం వంక చూశాడు.

"ఇందులో సందేహం ఏముంది? ఇది బంగారం లాంటి సంబంధం. లోపం ఉందని నేననుకోను" అన్నాడు కరుణాకరం.

"వెయ్యి అబద్ధాలు ఆడి అయినా ఒకపెళ్ళి జరిపించాలట. అలాంటిదేంలేదుకదా? బాల్య స్నేహితుడివి నాతో యథార్థం చెప్తావని ఇంతదూరం వచ్చాను" అన్నాడు.

"ఉన్నమాట చెప్పటం యథార్థంకాదా? నిజంగా నీవు సందేహించవలసినదేమీలేదు."

"పిల్ల ఎలాగుంటుంది?" అడిగాడు విశ్వనాథం.

"పిల్ల ఎలాగుంటుందంటే..."

"బంగారం బొమ్మలా ఉంటుంది. లక్ష్మీసరస్వతుల కలయిక" పూర్తి చేసింది అరుణ.

"బి.ఎ.పరీక్ష ఈ మధ్యనే వ్రాసింది. ఈ సంవత్సరం పిల్లకు పెళ్ళిచేసి, ఆమె భర్త అంగీకరిస్తే పై చదువులు చెప్పించాలని మనోహరరావుగారు అనుకుంటున్నారు" అన్నాడు కరుణాకరం.

"కుట్లు, అల్లికలు అలాంటి వాటిలో ప్రవేశం ఉందా?"

"విశ్వనాథం! ఈవిషయాలన్నీ ఇక్కడే అడిగేస్తే అక్కడ అడగటానికి ఏముంటుంది? అయినా ఇదేం ప్రశ్న? బి.సీ.కాలం నాటిది. నీ పెళ్ళిచూపుల్లోనూ, నా పెళ్ళిచూపుల్లోనూ ఇవే మోస్తరు ప్రశ్నలు వేసారు. పెళ్ళిచూపులనగానే ముందుగా స్ఫురించేవి ఈ ప్రశ్నలే. చేపపిల్లను పట్టుకొని నీకు ఈత వచ్చా అని అడిగాడట నీలాంటివాడే. చేపపిల్లకు ఈతా,ఆడపిల్లకు కుట్లు, అల్లికలూ రాకుండా ఉంటాయా?"

"డబ్బున్నవారికి గర్వం, అహంకారంఉండటం సహజం అంటారు. అది ఎంతవరకు నిజం?"

"నీ ప్రశ్నలోనే నీ జవాబు ఉంది. అయినా చాలా మంచి ప్రశ్నవేశావు. పేదవాడి కోపం పెదవికి చేటు. డబ్బున్నచోట గర్వం ఉండకుండా ఎలా ఉంటుంది? అయినా అది ఒక పెద్దలోపం ఎలాగౌతుంది?"

విశ్వనాథం ఏదో అడగాలనుకున్నాడు. తను ఏమైనా అంటే వాడు బాధపడతాడేమో? కరుణాకరం ఇంట్లోనూ పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్ల ఉంది. వాడి ముందే మరోసంబంధం గురించి మాట్లాడుతూ ఉంటే వాడికి బాధగా ఉండదా?

ఆ దంపతుల ముఖాల్లో ఆ బాధ లేశమాత్రంగానైనా కనిపించటం లేదేం? వీరు రాగద్వేషాలకు అతీతులా?

"గర్వం, అహంకారం మానవుల సహజధర్మం. విశ్వనాథం! వియ్యానికైనా కయ్యానికైనా సరి సమానులు కావాలంటారు. మనోహరరావుగారు బాగా కలిగినవాడు. కట్నకానుకలమీద నీకు మోజుంటే అతను నీకెలాంటి లోపం చేయడు. నీవు నీ పెద్దపిల్ల పెళ్లికి ఇరవైవేలు, రెండోదాని పెళ్ళిలో ముప్పైవేలు కట్నం యిచ్చావని విన్నాను. మనోహరరావుగారు ఏభైవేలదాకా ఇస్తారనే నేను అనుకుంటున్నాను. అన్నట్లు గుర్తుకొచ్చింది – అతను అల్లుడిని విదేశాలలో పై చదువులకి పంపించే ఉద్దేశ్యంలో ఉన్నాడు. నిజంగా ఇలాంటి అపురూపమైన సంబంధం దొరకటం భాగ్యమేననుకో!" అన్నాడు.

"కరుణాకరం! ఎంతసేపు నా అదృష్టాన్నే పొగుడుతావే కాని నీ విషయాలేం చెప్పదలుచుకోలేదా?" అన్నాడు విశ్వనాథం.

"ముంజేతి కంకణానికి అద్దం ఎందుకు? మా ఇంటి విషయాలు నీకు తెలియనివా? ఇప్పుడు మా జీతాలు గొర్రెతోకల్లా లేవు. అయినా ధరల పెరుగుదలవల్ల ఎంత సంపాదించినా పొట్ట గడవటం కష్టంగానే ఉంది."

"బాగుంది. ఇది అందరికీ వర్తిస్తుంది. మరి అమ్మాయికి సంబంధాలు చూస్తున్నావా? ఏనాడూ నోరు విడిచి ఏ మాటా అనవు" అన్నాడు విశ్వనాథం.

"ఉపాధ్యాయులు వారి దగ్గర నున్న విద్యను దానం చేస్తారు. కానీ ఎవరినీ ఏమీ అర్థించరు. అయినా సమయం వస్తే నీవంటి స్నేహితుల సహాయాన్ని ఆశిస్తానులే!" అన్నాడు కరుణాకరం.

"అమ్మాయి పెళ్లి సంబంధాలు చూస్తున్నాను. రఘు ఎం.ఏ. చదివాడు ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఏం ప్రయోజనం? ఈ రోజుల్లో క్లర్కు ఉద్యోగానికే బోలెడన్ని సిఫారసులు కావాలి, లేదా లంచం పొయ్యాలి. ఊరికే గోళ్లు గిల్లుకుంటూ కూర్చొనటం ఎందుకని వత్సల కూడా ఎం.ఏ.కి ప్రైవేటుగా కడుతున్నది. ఒకరిద్దరు పిల్లలకు ట్యూషన్లు చెప్తున్నది."

"ఒకటి రెండుచోట్ల దాని చదువే ప్రతిబంధకం అయ్యింది. గ్రాడ్యుయేట్ పిల్లతో మేం పడగలమా? సంసారపక్షంగా మెట్రిక్‌వరకు అయితే పర్వాలేదు అంటూ ఒకరిద్దరూ మూతి విరిచారు. గత్యంతరంలేక మా అమ్మాయి మెట్రిక్‌వరకే చదివింది అని చెప్పాను. అయితే అక్కడా మాకు నిరాశే ఎదురైంది. అబ్బే మెట్రిక్ కూడా ఒక చదువేనా? మీ అమ్మాయి గ్రాడ్యుయేషనుచేసి ఉండదా అనుకున్నాం – అంటూ వాళ్ళ పిల్లను చూసేందుకు అసమ్మతి తెలిపారు. అయినా ఆ సంబంధం స్థిరపరచాలన్న ఉద్దేశ్యంతో అసలు విషయం చెప్పాను. ఇన్ని అబద్ధాలా? ఇలాంటి వాళ్లతో మేం వియ్యమందలేం అన్నారు. విశ్వనాథం! అన్నిటికీ మూలం పేదరికం. అసలు వారు కోరిన కట్నం నేనిచ్చుకోలేని స్థితిలో ఉన్నాను" అన్నాడు కరుణాకరం.

"విచారించకు కరుణాకరం! ఆడపిల్లల్ని కన్నవారికి ఆ కష్టాలూ, ఈ శిక్షలూ తప్పవు."

"ఈ శిక్ష మావరకేపరిమితమైతే బాధలేదు. కాని వత్సల చేసిననేరమేమిటి? ఆమెకెందుకీ శిక్ష?"

"నాన్నగారూ! ఇలా పరితపించటంవల్ల ప్రయోజనం ఉంటుందా? కళ్యాణం వచ్చినా, కక్కువచ్చినా ఆగదంటారు. ఆ ఘడియలు ఇంకా రాలేదు. గంతకుతగ్గ బొంత. నా భర్త ఎక్కడో ఉండే ఉంటాడు. పేదవాళ్లమైనంత మాత్రాన ఏ తండ్రి తన కూతురి పెళ్లి చేయకుండా వున్నాడు? మామయ్యగారి మనసు నెందుకు కలతపెడతారు? రాకరాక వచ్చారు. నాలుగు కులాసా కబుర్లు చెప్పరాదూ?" అంది వత్సల కల్పించుకొని.

"బాగా చెప్పావు తల్లీ! ఆ ఘడియ రావాలి కాని, కానున్న కార్యం గంధర్వులు తీర్చరూ? కరుణాకరం! అమ్మాయి పెళ్లి విషయం నీవు చింతపెట్టుకోకు. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేశాను. అందులో కష్టసుఖాలు నాకూ తెలుసు."

"నువ్వు ఆమాత్రం హామీ యిచ్చావు. చాలు"

పార్వతి ఆ సంభాషణ వింటున్నది. అసూయలేని మనుషు లుంటారంటే నమ్మశక్యంగా లేదు. ఎంతైనా తన భర్త అతనికి బాల్యస్నేహితుడు. 'విశ్వనాథం, మీ ప్రకాశానికి మా వత్సలను చేసుకో' అని అడిగి ఉంటే అతను కాదంటారా? ఉహు! అతను అలా కోరడు. స్వార్థరహితమైన స్నేహం

అతనిది. పోనీ ఇతనైనా తన నోటితో అనవచ్చునుగా! ఆ మాట అంటే నోటి ముత్యాలు రాలిపోతాయా? పైగా తనేదో ఘనకార్యం చేయబోతున్నట్లు ఈ ప్రసంగాలు ఇప్పుడు తేవాలా?

ఉన్నట్టుండి వాతావరణం మారిపోయింది. అందరూ మౌనవ్రతం పట్టారు. ఎవరు మాత్రం ఏం మాట్లాడగలరు? అందరి హృదయాల్లోనూ అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయి.

"అన్నయ్యగారూ! పెళ్లిచూపులకి ఈరోజే వెళ్తారా? లేక రేపా?" అంది అరుణ.

"చెల్లెమ్మా! రేపటివరకు ఆగే ప్రసక్తిలేదు. రాత్రి బండికి రిజర్వేషన్లు చేయించుకున్నాం. కాని మనోహరరావుగారింటికి వెళ్ళాలన్న కోరికలేదు" అన్నాడు విశ్వనాథం.

"పిల్ల నచ్చితే తాంబూలాలు ఇచ్చే ఉద్దేశ్యంతోనే వచ్చానన్నావు. ఇదేమైనా పెద్దమనిషి తరహానా? నన్ను అడుగుతే అసలు పెళ్ళిచూపులే అవసరం లేదంటాను. ఆపిల్ల అన్నివిధాలా మీవాడికి తగింది."

"నిజం అన్నయ్యగారూ! మీ తరపున మేం చూశామనుకోండి. అయినా సాంప్రదాయానుకూలంగా ఆ ముచ్చటా కానివ్వండి. ఇంతవరకు ఆడపిల్లల తండ్రిగా మీరు పెళ్లిచూపుల ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు మగపెళ్ళివారి హోదాలో వెళ్ళండి. ఎంత డబ్బు గలవాళ్ళైనా వాళ్లకూ ఆ అనుభవం కావాలిగా!" అంది అరుణ.

"కరుణాకరం! మీరు ఆదిశేషుల్లా వేయి నాలుకలతో వారిని ప్రశంసిస్తున్నారు. అయినా ఈ సంబంధంలో నేను కోరుకున్న లక్షణాలు కనిపించటంలేదు. మరి వెళ్లి వాళ్లను నిరాశపెట్టటం దేనికి?" అన్నాడు విశ్వనాథం.

కరుణాకరం తెల్లబోయాడు. అరుణ ఆశ్చర్యపడింది. పార్వతి ముసిముసిగా నవ్వుకుంది.

"పొరపాటున మేం నోరుజారి విపరీతంగా ఏమైనా అన్నామా? ఇంత దూరం వచ్చి పిల్లను చూడకుండానే మనసు మార్చుకున్నావంటే మావల్ల ఏదో అపరాధం జరిగి ఉంటుంది" అన్నాడు కరుణాకరం.

"అదేంలేదు. మీభార్యాభర్తలూ, చివరకు వత్సలా ఈ సంబంధం అన్ని విధాలా అనువైందనే అన్నారు. మాకంటే ఈ సంబంధం మీకే బాగా నచ్చింది. కాని..."

"నువ్వు ఎలాగైనా సమర్థించుకున్నా నేను అంగీకరించలేను. ఇంతదూరం ఒక ప్రయోజనంతో వచ్చి వట్టిచేతులతో వెళ్లిపోతున్నావంటే అది మా నేరమే."

"డబ్బున్న చోట గర్వం ఉండటం సహజం అని నీవు అంగీకరించావు. ఔనా?"

"వారి మాటలకేం అన్నయ్యగారూ! పుట్టింట్లో ఏ పిల్లకైనా గర్వం ఉంటుంది. అది లోక సహజం. పెళ్లి అయిన తరువాత తన సంసారం, తన ఇల్లు అంటూ ఏర్పడిన తర్వాత ఆ గర్వం తనంతట తనే మాయమవుతుంది. అయినా ధనగర్వం జ్యోతిలో ఉందని నేను భావించను. చదువుకున్న పిల్ల, ఆ మాత్రం జ్ఞానం లేదా ఆమెకు?" అంది అరుణ.

"అతను పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు నుండి లయన్సు క్లబ్ వరకు అన్ని సంఘాలతోనూ ప్రమేయం ఉన్నవాడు అన్నావు. అది అర్హత వల్లనా-స్నేహభావం వల్లనా? డబ్బు మూలంగా కాదూ?"

"ధనం మూలం మిదం జగత్. ఈ కఠోర సత్యాన్ని ఎలా కాదనగలం? పేరూ, ప్రతిష్ఠా ఉన్న వారి చుట్టూ ప్రజలు ఎగబడితే అది వారి తప్పా? అతని చేతుల్లో చాలా అధికారాలున్నాయి.

ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ప్రజాసేవ చేస్తున్నాడు. చేతిలో డబ్బు, అధికారం ఉన్నంత మాత్రాన అతను చెడ్డవాడని ఎందుకు భావించాలి? పైగా అతనిప్పుడు ఒక కుటుంబయజమానిగా, ఒక ఆడపిల్ల తండ్రిగా తన కర్తవ్యం నిర్వహించాలనుకుంటున్నాడు. అదినేరమా?"

"అతనికి బోలెడంత రాజకీయ పరపతి ఉంది.అది పదవివల్లనేగా? అయితే ఈ పదవులూ, పరపతులూ స్థిరమైనవే అంటావా?"

"మనిషి జీవితానికే స్థిరత్వం లేదు. అందువల్ల రాజకీయాల్లో స్థిరత్వం ఉండాలన్న రూలులేదు. అంతమాత్రాన మనం వర్తమానాన్ని ఎలా కాదనగలం? అతనికి బోలెడంత పరపతి ఉంది. అయితే ఆ పరపతిని ఉపయోగించి తన పిల్లను మీవాడికిచ్చే బలవంతం చెయ్యలేదే! ఒక ఆడపిల్ల తండ్రిగా నీతో సంప్రతించాడు".

"బాగానే ఉంది. అల్లుడ్ని తన స్వంత ఖర్చులతో విదేశాలకు చదువులకు పంపించే ఉద్దేశ్యం అతనికి ఉంది అన్నావు. అంటే అతని కంటికి కాబోయే అల్లుడు హీనుడిలా కనిపిస్తున్నాడా? చదువు సంధ్యలు చెప్పించవలసిన బాధ్యత తల్లిదండ్రులది. ఇకపోతే అతిమేధావంతుల్ని విదేశాలకు పంపవలసిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వానిది. అంతేకాని తన దగ్గర దండిగా డబ్బు ఉందని ఒకరిని ప్రలోభపరచటం భావ్యమంటావా? అది రెండో పక్షం వాళ్లను అవమానపర్చడం కాదంటావా?"

"ఇది నీ తర్కం. తన అల్లుడి ఉన్నతికోరటం నేరమా? అతనికి సామర్థ్యం ఉంది కనుకనే అతను అల్లుడ్ని విదేశాలకు పంపాలనుకుంటున్నాడు. అందువల్ల బాగుపడేది తన కూతురేగా? ఇది అన్యాయం అని ఎందుకనుకోవాలి?"

"రాజకీయాల్లో ఉంటున్నా తన పిల్ల పెళ్లికి యాభైవేలరూపాయలు కట్నంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడన్నావు. డాక్టరైనా, ఇంజనీర్లయినా, ఐ.ఎ.ఎస్. ఆఫీసరైనా అతను డెబ్బైఅయిదువేల దాకా కట్నం ఇవ్వాలనుకుంటున్నాడని మధ్యవర్తులద్వారా తెలిసింది. అతను తన కొడుకుల పెళ్లిలోనూ భారీగానే కట్నాలు తీసుకున్నాడట. చట్టాలను రూపొందించినవారే వాటిని పాటించకపోవటం ధర్మమా?"

"రాజకీయ నాయకులైనా వారూ సంఘజీవులే. చట్టాలను దేశసంక్షేమంకోసం రూపొందిస్తారు. అంతమాత్రాన అనాదిగా వస్తున్న ఆచారవ్యవహారాలను ఎలా మానుకోగలరు? ఇచ్చే వాడికి పుచ్చుకున్నవాడికి మధ్య సామరస్యం ఉంటే చట్టం చేయగలిగిందేమిటి? కట్నం తీసుకోకుండా తన కొడుకుల పెళ్ళిళ్లు చేస్తానని మనోహరరావుగారంటే అతడ్ని లోకం పిచ్చివాడంటుంది. పైగా అతని పిల్లల్లో ఏవో అవగుణాలుండి ఉంటాయని అనుకుంటారు. అయినా డబ్బుమీద ఆశలేనిదెవరికి? అతను సన్యాసి కాదే! మరి చట్టాలూ, ధర్మాలూ అంటున్నావు. నువ్వు నీ పిల్లల పెళ్ళిళ్లకు కట్నాలు ఎందుకిచ్చావు? కారణం అతి స్వల్పం. నీవూ సంఘజీవివి. లోకంలో అందరూ పాటిస్తున్నరీతిలో నీవూ ఆచరించావు."

"నిజమే! నాకంటూ ఆశయాలున్నా, వాటికోసం అమ్మాయిల భవిష్యత్తు కాలరాయలేను. అందుకే ఆడపిల్లల పెళ్ళిళ్లు కట్నాలు ఇచ్చి చేశాను. కాని నా ఆదర్శాలను మగపిల్లవాడి తండ్రిగా నేను పాటించగలను. మా అబ్బాయి పెళ్లి కట్నం తీసుకోకుండా చేస్తానంటే నన్నూ పిచ్చివాడిగా భావిస్తావా? లేదా మావాడిలో ఏదో అవగుణం ఉందనుకుంటావా?"

"నీ ఆదర్శాలకు జోహార్లంటాను."

"ఏం! నువ్వు ఈ లోకంలోనివాడివికావా? కట్నం తీసుకోనప్పుడు మాలో లోపాలు కనిపించవా? అసలు ఈ సమస్యలకు మూలం ఒకే వ్యక్తి. ఒకప్పుడు ఆడపిల్ల తండ్రిగా, వేరొకప్పుడు మగపిల్లాడి తండ్రిగా వ్యవహరించటం. ఈ కట్నాలవల్ల ఎన్ని ఇబ్బందులకు గురి కావలసినవస్తున్నాదో అని ఆడపిల్ల తండ్రిగా రోదిస్తాడు. కానీ మగపిల్లాడి తండ్రిగా ఆ మాట మరిచిపోతాడు" అన్నాడు విశ్వనాథం.

"అది యథార్థమే. ఐతే నీవు కోరిన మార్పు ఇంత త్వరగా వచ్చేది కాదు" అన్నాడు కరుణాకరం.

"బాగుంది. రామాయణం వదిలి పిడకల వేటలో పడ్డారు. అసలు సమస్య మరిచిపోయారా? మీరు కట్నం తీసుకోకుండా వాళ్ల అమ్మాయిని చేసుకుంటే మనోహరరావుగారికి అభ్యంతరం ఉండదు. ఇక విదేశాలకు అల్లుడిని పంపడం, అదీ మీ అంగీకారంతోనే. మరి బయలుదేరండి. రాత్రి బండికే ప్రయాణం అంటున్నారు" అంది అరుణ.

"కరుణాకరం! చల్లకొచ్చి ముంత దాయటం ప్రయోజనం లేదు. నీకు పెళ్లి కెదిగిన కూతురుందని నాకు తెలుసు. అయితే ఆమెకు వేరే ఏదైనా సంబంధం కుదిర్చావో, లేదో తెలియదు. వియ్యానికైనా, కయ్యానికైనా సరిసమానులు కావాలని నీవు మా సంబంధంగురించి ప్రయత్నించలేదు. అక్కడా, ఇక్కడా తిరిగి ఆగచాట్లు పడుతున్నావు. సమానత్వాన్ని ఒక్క డబ్బుతోనే కొలవాలా? ఉపాధ్యాయుడుగా పిల్లలకు ఎన్నో నేర్పే నీకు ఈవిషయం తట్టలేదా? నేను నీదగ్గర కట్నాన్ని ఆశిస్తానని ఎలా అనుకున్నావు? తాంబూలాలు పుచ్చుకునే ఉద్దేశ్యంతోనే వచ్చాను. ముందుగా మీ గురించి తెలుసుకోవాలి. వత్సల పెళ్లి వేరెవరితోనో ఇంతవరకు నిశ్చయం కాకపోతే ఆమెను మా కోడలిగా చేసుకోవాలి. లేదా ఆమెకు నీ వేదైనా ఇతర సంబంధం కుదిర్చి ఉంటే మనోహరరావుగారి అమ్మాయిని చూడాలి. ఇదీ నా పథకం. మరి నువ్వు చెప్పు, మనోహరరావుగారి అమ్మాయిని చూడాలంటావా?" అన్నాడు విశ్వనాథం.

"విశ్వనాథం! నీ ఆదరాభిమానాలకు మరోమారు ధన్యవాదాలు. నువ్వు మనోహరరావుగారి అమ్మాయిని చూడాలనే వచ్చావు. ఇప్పుడు నీ బాల్యస్నేహితుడి దీనావస్థను చూసి మనసు మార్చుకోవటం సభ్యత కాదు. నా మాట విను. జ్యోతినే కోడలుగా చేసుకో. నాకు వత్సల ఎంతో, జ్యోతీ అంతే. నువ్వు మరో రూపంలో నాకు సహాయం చెయ్యి కాదనను" అన్నాడు కరుణాకరం.

"అన్నయ్యగారూ! ఆయన అన్నది సబబు. ఇప్పుడు మీరు ఇలా చేస్తే మనోహరరావుగారు ఆ నింద మా మీద వేస్తారు."

"పార్వతి ముభావంగా కూర్చోలేకపోయింది. "ఏమండీ! బాల్యస్నేహితుడితో ఇంత నాటకమా? మీ ఉద్దేశ్యం నేను ముందే పసిగట్టాను. ఆయనకు ముందుగా ఓ ముక్క రాస్తే బాగుండేది కదా!" అని భర్తతో అని "అన్నయ్యగారూ! ఇందులో తప్పేంలేదు. మేం ఇంతవరకు మనోహరరావుగారికి ఏ మాటా ఇవ్వలేదు. అసలు మేమిక్కడకు వస్తున్నట్లు వారికి తెలియదు. కాని మీకు మా సంబంధం ఇష్టం లేకపోతే బలవంతం లేదు" అంది పార్వతి.

కరుణాకరం భార్య వంక చూశాడు. అరుణ అశ్రుపూరిత నయనాలతో పార్వతి వంక చూసింది.

పార్వతి వత్సల వంక చూసింది.

ఏదీ! వత్సల ఏదీ?

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 4.4.1990)